## క్లుప్తంగా

### మిర్చి యార్డు చైర్మన్‌కు అభినందనలు



నెహ్రూనగర్: గుంటూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతన పాలకమండలికి చైర్మన్‌గా ఎంపికైన నిమ్మకాయల రాజనారాయణకు నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు ఆదివారం అభినందనలు తెలిపారు. సంపత్ నగర్‌లోని మేయర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా రాజనారాయణ కలిశారు. పాలకవర్గం పదవి పొందిన వారు గుంటూరు మార్కెట్ యార్డు ఖ్యాతిని నలుదిశలా వ్యాప్తి చెందేలా కృషి చేయాలని నగర మేయర్ సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సల్మా ఖాజా మొహిద్దీన్, వైఎస్సార్ సీపీ నాయకులు కంతేటి శ్యాం శేఖర్, కల్యాణం శంకర రావు, బాలయ్యపాల్గొన్నారు.

### నగరంలో జడి వాన



నెహ్రూనగర్: గుంటూరు నగరంలో ఆదివారం జడివాన కురిసింది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు అప్పుడప్పుడు చిన్న చిన్న చినుకులు అప్పుడప్పుడు పెద్దగా వర్షం పడటంతో పాటు, ఈదురుగాలులు రావడంతలో నగరంలోని పలు ప్రాంతాల్లో చెట్లు నెలకొరిగాయి. ఆగకుండా వర్షం పడతుండటంతో నగర వాసులకు ఇళ్లకే పరిమితం కావాల్సిన పరిస్థితి నెలకొంది.

### నేడు నగరపాలక సంస్థలో స్పందన

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు చెప్పారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు సచివాలయాల్లోనూ స్పందన ఉంటుందని, స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు ఫిర్యాదు చేయవచ్చని ఆమె సూచించారు.

### ఆగస్టు 6న దళిత గిరిజన చైతన్య సదస్సులు

నెహ్రూనగర్: దళిత గిరిజనుల ఆత్మగౌరవ దినంగా పాటిస్తూ దళిత గిరిజన చైతన్య సదస్సులు ఆగస్టు 6న నిర్వహించనున్నట్లు భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ తెలిపారు. సంజీవయ్యనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద దళిత గిరిజన చైతన్య సమావేశాలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నల్లపు నీలాంబరం, ప్రభుదాస్, జాన్‌బాబు, సాల్మన్‌రాజు, ఏసుబాబు పాల్గొన్నారు.

### ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి



పెదకాకాని: జాతీయ రహదారిపై వెళుతున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన తక్కెళ్లపాడు శివార్లలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన దర్శి సుధాకర్‌రావు ద్విచక్రవాహనంపై ఆదివారం సాయంత్రం గుంటూరు సుద్దపల్లిడొంకలో నివాసం ఉంటున్న తన బావ ఇంటికి బయలు దేరాడు. మార్గమధ్యలో తక్కెళ్ళపాడు శివారు ప్రాంతంలోకి చేరుకునే సరికి ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన డివైడర్ వెంట ఉన్న ఇనుప రెయిలింగ్‌ను ఢీ కొంది. ఈ ఘటనలో తలకు గాయం కావడంతో రక్తస్రావమైన సుధాకరరావు (36) సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. అదే సమయంలో వర్షం పడటంతో ప్రమాదం జరిగిన సమాచారం కూడా ఆలస్యంగా చేరింది. వాహనదారుల సమాచారం మేరకు పెదకాకాని పోలీసులు అక్కడికి చేరుకుని ప్రమాదంపై దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

### కార్మెల్‌కొండకు పోటెత్తిన భక్తులు

ఫిరంగిపురం: మండలకేంద్రం ఫిరంగిపురంలోని కార్మెల్ కొండపై వెలసిన కార్మెల్ మాతను దర్శించుకునేందుకు పలుప్రాంతాలనుంచి భక్తులు ఆదివారం తరలివచ్చారు. ఉదయాన్నే బస్సులు, రైళ్లలో పొద్దుటూరు, కర్నూలు, ఆదోని, మార్కాపురం ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చారు. కొండదిగువ భాగంలో ఏర్పాటు చేసిన కార్మెల్ మాత స్వరూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించారు. మెట్ల మార్గంద్వారా కొండ ఎక్కి తలనీలాలు సమర్పించి కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి మాతను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

# మణిపూర్ ఘటన నేరస్తులను కఠినంగా శిక్షించాలి

- ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు
- శంకర్‌విలాస్ సెంటర్‌లో విద్యార్థి, యువజన సంఘాల నిరసన



మణిపూర్‌లో హింసకు పోస్టర్లతో ప్రదర్శన

గుంటూరు ఎడ్యుకేషన్: మణిపూర్‌లో చోటుచేసుకున్నఘటనలు, నేరాలకు బాధ్యులైన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనను నిరసిస్తూ ఆదివారం ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శంకర్‌విలాస్ సెంటర్లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. జాన్సన్‌బాబు మాట్లాడుతూ మణిపూర్‌లో మూడు నెలలుగా దాచిన హింసాత్మక, అమానవీయ ఘటనలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని పేర్కొన్నారు. మే 3వ తేదీన మొదలైన అల్లర్లను ప్రపంచానికి తెలియకుండా దాచి పెట్టడంలో ప్రధాని మోదీ నాయకత్వం సఫలీకృతమైందని ఆరోపించారు. ఇన్ని దారుణాలు జరుగుతున్నా వాటిని బయటకు తెలియకుండా, ఇంటర్నెట్ సదుపాయం లేకుండా చేయడం ద్వారా బీజేపీ ప్రభుత్వం అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిందని పేర్కొన్నారు. మణిపూర్‌లో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి వెళ్లిన వాళ్లపై పోలీసు కేసులు పెట్టించి, జైలు పాలు చేయడంతో పాటు అల్లర్లు సృష్టించిన విషయాన్ని బయటకు రాకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దాచి పెట్టిందని విమర్శించారు. ఒక రాష్ట్రంలో మహిళలకే భద్రత లేకుండా పోవడం దేశంలోని బీజేపీ వారంతా సిగ్గుపడాలని, నిత్యం భారత్ మాతను తలుచుకోవడం, భరతమాత ఒడిలో ఉన్నటువంటి ఆడవాళ్లను ఇలా హేయంగా చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. బేటి బచావో, బేటీ పడావో అంటూ నినాదాలు ఇవ్వడం మినహా, దేశంలోనే ఆడవారికే భద్రత లేకుంటే, ఒక దేశాన్ని వీళ్ళు ఏ మాత్రం రక్షిస్తారో అర్థమవుతోందని ఆరోపించారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వలి మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు నిలయంగా ఉన్న మణిపూర్‌లో రెండు నెలలకుపైగా విద్వేష పూరిత మంటలు చెలరేగుతూ, వందల మంది మరణించినా, చర్చీలు, దేవాలయాలు, విధ్వంసానికి గురైనా, ప్రధాని మోదీ మౌనంగా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. మణిపూర్ గడ్డపై మానవ మృగాలు యథేశ్చగా సంచరించే పరిస్థితి ప్రభుత్వాల ఘోరవైఫల్యానికి నిదర్శనమన్నారు. నిరసన ప్రదర్శనలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, మరియదాసు, ఏఐఎస్‌ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు జ్ఞానదీప్, యశ్వంత్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అరుణ్, వెంకటేశ్వర్‌రెడ్డి, సాయి, బన్నీ, ఇస్మాయిల్, రెహమాన్ పాల్గొన్నారు.

**బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ లేదు..**

నెహ్రూనగర్: బీజేపీ పాలనలో దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విముక్త చిరుతల కక్షి పార్టీ(వీసీకే) మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె.జయసుధ పేర్కొన్నారు. మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న హత్య, లైంగిక దాడులను నిరసిస్తూ నగరంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ మణిపూర్‌లో దారులు జరుగుతున్నప్పటికి కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. గిరిజన, క్రైస్తవులపై జరుగుతున్న ఆరాచాలకు అరికట్టకపోతే వచ్చే ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గంటా ప్రభుదాస్, జీఆర్ భగత్ సింగ్, నల్లపు నీలాంబరం, తన్నీరు సాంబయ్య పాల్గొన్నారు.

**కుల నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో**

కుల నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మణిపూర్ ఘటనలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంస్థ ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం చేసిన చట్టాలను బలంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ నాయకులు సుజాత, అఖిల, మహాలక్ష్మి, జహీరా పాల్గొన్నారు.

# 29న మేము కూడా చరిత్ర నిర్మించాం పుస్తకావిష్కరణ సభ




ఆహ్వానపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితరులు

పాత గుంటూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేపట్టిన కుల నిర్మూలన ఉద్యమంలో మహిళల పాత్ర కీలకమైందని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని హోటల్లో డాక్టర్ అంబేడ్కర్- జాషువా- పూలే- పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న సీపీఎం కార్యాలయంలో నిర్వహించనున్న మేము కూడా చరిత్ర నిర్మించాం పుస్తకావిష్కరణ సభ ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీ విమర్శకులు సిహెచ్.సుశీలమ్మ, సిహెచ్.కోటేశ్వరమ్మ, మాల మహానాడు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బత్తుల అనిల్ బాబు, కొమరాల రవికుమార్, నాయీ బ్రాహ్మణ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు, కాపు శ్రీనివాస్, చల్లా మధుసూదన్ రావు, సీనియర్ పాత్రికేయులు బండారు సురేష్ బాబు, గాయకులు జాన్ బాబు, చంద్రపాల్ పాల్గొన్నారు.

# విద్య ద్వారానే సూర్య బలిజ అభివృద్ధి సాధ్యం



విద్యార్థులతో రవీంద్రనాథ్, వేణుబాబు, కైలాష్‌నాథ్ బాబు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న సూర్య బలిజ సంఘస్తుల సామాజిక, రాజకీయ అభివృద్ధికి విద్య ఎంతో ముఖ్యమని సూర్య బలిజ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లు డాక్టర్ చదలవాడ రవీంద్రనాథ్, చదలవాడ వేణుబాబు పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో సూర్య బలిజ విద్యా సంఘ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలు, బ్యాగులు ఇతర విద్యాఉపకరణాలతో పాటు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. ఈ సందర్భంగా సభకు అధ్యక్షత వహించిన సంఘ కార్యదర్శి మద్దెల కైలాష్‌నాథ్ బాబు మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా సంఘ ఆధ్వర్యంలో విద్యా సేవా కార్యక్రమాలు దాతల సహకారంతో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చదలవాడ రఘురాం, సిద్దాబత్తుని శ్రీనివాసరావు, దాసరి నాగేశ్వరరావు, నగర కార్యదర్శి మోహన్ రావు, జిల్లా నగర సంఘాల కోశాధికారులు విజయ కుమార్, పువ్వుల మహేష్, సీహెచ్ సుధాకర్, అవధానుల లింగేశ్వరరావు, ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.

# జీజీహెచ్‌లో సర్వీస్ బ్లాక్ త్వరలో పూర్తి చేస్తాం



సర్వీస్ బ్లాక్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో నిలిచిన సర్వీస్ బ్లాక్ నిర్మాణాన్ని నాబార్డు నిధులతో పదినెలల్లో పూర్తి చేయనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. సర్వీస్ బ్లాక్‌ను ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నాబార్డు నుంచి రూ.10 కోట్లు మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నిర్మాణం పూర్తయితే రేడియాలజీ, సీటీ స్కాన్, ఎంఆర్‌ఐ మెషిన్, మెడికల్ స్టోర్స్, డైనింగ్ హాల్ అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఆయన వెంట సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్ ఉన్నారు.

**ఫైల్స్ దుమ్ము దులిపారు..**

జీజీహెచ్ కార్యాలయంలో స్వచ్ఛత పరిశుభ్రతకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ఆదివారం చర్యలు చేపట్టారు. ఎప్పటి నుంచో మూలనపడేసి, బీరువాలపై కుప్పలుగా పడేసిన పాత ఫైల్స్, పాతబీరువాలు అన్నింటిని కట్టలు కట్టి స్టోర్స్ విభాగానికి తరలించారు. ఈ సందర్భంగా డెప్యూటీ ఆర్ఎంఓ గది వద్ద ఉన్న విద్యుత్ ప్యానెల్ బోర్డు వేరో చోట ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

**డైట్ క్యాంటీన్‌ను మధురాన్నం ట్రస్ట్‌కు..**

గుంటూరు జీజీహెచ్‌లో రోగుల సహాయకులకు పెడుతున్న ఉచిత భోజనాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ పరిశీలించారు. భోజనం రుచిచూసి చాలా బాగుందని కితాబునిచ్చారు. జీజీహెచ్‌లో డైట్ క్యాంటిన్, కమర్షియల్ క్యాంటిన్‌లో నాలుగు రోజులుగా ఆహార పదార్థాలను పరిశీలిస్తున్నామని, మధురాన్నం మాదిరిగా లేవన్నారు. మధురాన్నం ట్రస్ట్ నిర్వాహకులకు రోగులకు భోజనం పెట్టే డైట్ క్యాంటిన్ నిర్వహణ అప్పగించాలని ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు.

# కవులు కాలం కంటే వేగంగా కదలాలి




ఆళ్ల నాగేశ్వరరావును సత్కరించిన అతిథులు, సాహితీవేత్తలు

పాత గుంటూరు: కవులు, రచయితలు కాలం కంటే వేగంగా ముందుకు సాగినప్పుడే సమాజం చైతన్యవంతమవుతుందని సుప్రసిద్ధ కథా రచయిత వడలి రాధాకృష్ణ అన్నారు. నవ్యాంధ్ర రచయితల సంఘం, బాపు- రమణ- బాలు కళాపీఠం ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని ఎస్.హెచ్.ఓ హాలులో ఆదివారం ‘కవిమిత్రుల సంగమం- కవి సమ్మేళనం’ నిర్వహించారు. సభకు రంగిశెట్టి రమేష్ అధ్యక్షత వహించారు. రాధాకృష్ణ మాట్లాడుతూ సభ్యసమాజం తలదించుకునేలా మణిపూర్‌లో చోటుచేసుకున్న హేయమైన చర్యల్ని సాహితీవేత్తలంతా ఖండించాలన్నారు. అమానవీయమైన ఈ దుర్ఘటనలపై కవులు రచయితలు గొంతెత్తాలని పిలుపునిచ్చారు. వివిధ సాహితీ ప్రక్రియల్లో తమ నిరసనని తెలియజేయాలని సూచించారు. అధికార భాషా కమిషన్ రాష్ట్ర సభ్యుడు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కవులు, రచయితలకు ప్రభుత్వం నుంచి త్వరలో శుభవార్త అందబోతుందని చెప్పారు. డాక్టర్ రమణ యశస్వి రచించిన ‘గణపవరం కథలు’ కథల పుస్తకాన్ని రచయిత్రి దినవహి సత్యవతి సమీక్షించారు. ఇటీవల కుసుమ ధర్మన్న సాహిత్యసేవా పురస్కారం అందుకున్న కలిమిశ్రీని అతిథులు, పలువురు సాహితీవేత్తలు సత్కరించారు. లక్నోకు చెందిన వర్తీ వెల్నెస్ ఫౌండేషన్ అవార్డు పొందిన ఆళ్ల నాగేశ్వరరావును సత్కరించారు. బి.జనార్ధనరెడ్డి, గోలి హనుమచ్ఛాస్త్రి, మానేపల్లి నరసింహాచారి, పెద్దేటి యోహాను, ఈపూరి ప్రేమకుమార్, షేక్ రహీంసాహెబ్, సొపాటి ప్రభాకర్, మన్నం వెంకట గురువు, కారంచేటి విజయ్ కుమార్, మేళ్లచెర్వు మాధవి, పింగళి భాగ్యలక్ష్మి, ఎం.శ్రీలక్ష్మి, కె.సుబ్రహ్మణ్యం, వి.భీమేశ్వర ప్రసాద్ తమ కవితల్ని వినిపించి సభికుల్ని అలరించారు. కవి సమ్మేళనంలో లంకా మాధవి చదివిన కవిత మొదటి బహుమతి పొందగా, చందు నాగేశ్వరరావు, డాక్టర్ నల్లపనేని విజయలక్ష్మి చదివిన కవితలు రెండవ బహుమతిని పొందాయి. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు, బండికల్లు జమదగ్ని పాల్గొన్నారు.

### ఘనంగా కె.ఆర్.ప్లానర్స్, డెవలపర్స్ వార్షికోత్సవం



పాత గుంటూరు: గుంటూరు వారి తోటలోని కె.ఆర్. ప్లానర్స్, డెవలపర్స్ 10 వార్షికోత్సవం ఇంజినీర్ అబ్దుల్ రహీమ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే షేక్ మహమ్మద్ ముస్తఫా, మైనారిటీ శాఖ ప్రభుత్వ సలహాదారు ఎస్.ఎం. జియావుద్దీన్, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, మాజీ ఎమ్మెల్యే షేక్ నంబూరు సుభాని, ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొమ్మసాని కమలాకర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ గులాం రసూల్, షేక్ షౌకత్ పాల్గొన్నారు.

### నేడు టీజేపీఎస్ కళాశాలలో మెగా జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో సోమవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మ్యాజిక్‌బస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మేళాలో హెటిరో డ్రగ్స్, హెచ్‌బీడీ ఫైనాన్స్, ఎఫ్‌ట్రానిక్స్, జియో, క్రోమా, యాక్సిస్ బ్యాంక్, ఫ్లిప్‌కార్ట్, ఫిన్‌కేర్ తదితర తొమ్మిది రకాల కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. డిగ్రీ, ఫార్మసీ, పీజీ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు విద్యార్హతల సర్టిఫికెట్లు, బయోడేటా, రెజ్యూమ్‌తో హాజరు కావాలని సూచించారు.

### కార్పొరేషన్ టీచర్లకు పీఎఫ్ రుణాలు మంజూరు చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: నగరపాలక సంస్థ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు వారి పీఎఫ్ ఖాతాల నుంచి రుణాలు మంజూరు చేయాలని యూటీఎఫ్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.చిన్నయ్య, కె.ప్రభూజీ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జీఓ 84 ప్రకారం నగరపాలకసంస్థ ఉపాధ్యాయుల సర్వీసు, పర్యవేక్షణ బాధ్యతలను విద్యాశాఖకు అప్పగించిన నాటి నుంచి పీఎఫ్ ఖాతాలు, రుణాల మంజూరు నిలుపుదల చేశారని తెలిపారు. పిల్లల చదువులు, వైద్య అవసరాల కోసం దాచుకున్న పీఎఫ్ నుంచి రుణాలు అందకపోవడం వలన ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు కొత్త పీఎఫ్ ఖాతాలను తెరిచినట్లయితే ఆదాయపు పన్ను నుంచి కొంత మినహాయింపు లభిస్తుందని తెలిపారు.

# భారతీయ ప్రాచీన కళలకు గొప్ప చరిత్ర

క్రికెటర్ అంబటి రాయుడు



అంబటి రాయుడుతో సిలంబమ్ విజేతలు

గుంటూరు వెస్ట్(క్రీడలు): భారతీయ ప్రాచీన కళలకు ప్రపంచ వ్యాప్తంగా గొప్ప చరిత్ర ఉందని ప్రముఖ భారత క్రికెటర్ అంబటి రాయుడు తెలిపారు. ఏపీ సిలంబమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కాలేజీలో ఆదివారం రాష్ట్ర స్థాయి సిలంబమ్(కర్ర సాము) పోటీలను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సతీమణి డాక్టర్ మేఘన లాంఛనంగా ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 155 మంది చిన్నారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. సాయంత్ర బహుమతి ప్రధాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అంబటి రాయుడు మాట్లాడుతూ ప్రాచీన సంస్కృతిలో ఆత్మ రక్షణకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏపీ సిలంబమ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బీవీ నరసింహారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రిషిరాజ వర్మ, సంయుక్త కార్యదర్శి శివరామ కృష్ణ వర్మ, ఏపీ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణదేవ్ పాల్గొన్నారు.

# రేపు మామిళ్లపల్లిలో ఉచిత గుండె వైద్య పరీక్షలు

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా ఈ నెల 25వ తేదీ మంగళవారం పొన్నూరు మండలం మామిళ్ళపల్లి గ్రామంలో ఉచిత గుండె సంబంధ వైద్య పరీక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య - వైద్యం రెండూ సమాజానికి రెండు కళ్లు వంటివని విశ్వసించే బజరంగ్ ఫౌండేషన్, సేవా కార్యక్రమాల్ని ఈ రెండు రంగాలలో విస్తృత స్థాయిలో చేపడుతున్నట్లు తెలిపారు. చరిత్రలో శాశ్వతంగా స్థానం సాధించేంత అద్భుత పరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో కొనసాగే జగన్నామ సంక్షేమ సంవత్సరం కార్యక్రమంలో భాగంగా ‘మీ గుండె పదిలం’ అంటూ ఉచిత వైద్య శిబిరాన్ని మామిళ్లపల్లి గ్రామస్థులకు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. హృదయ సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ముందుగా వైద్య పరీక్షలను, తదనంతర గుండె చికిత్సలు అందించటం లక్ష్యంగా ఈ ఉచిత వైద్య శిబిరం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ మెడ్‌స్టార్ హస్పటల్ వారి సహకారంతో నిర్వహించనున్న ఈ వైద్య శిబిరానికి ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ బి.విజయచైతన్య, వైద్య బృందం వైద్య పరీక్షలను, వైద్య సహాయాన్ని అందిస్తారని అంబటి మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ప్రజలు ఈ ఉచిత గుండె సంబంధ వైద్య పరీక్ష శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# వాస్తు సిద్ధాంతి గుమ్మా దంపతులకు సన్మానం



లక్ష్మీనారాయణ, సామ్రాజ్యం దంపతులను సన్మానిస్తున్న అతిథులు

పాత గుంటూరు: సమాజంలో పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. పాత గుంటూరు సుద్దపల్లి డొంకలోని సీతారాముల కమ్యూనిటీ హాల్‌లో 50 వసంతాల వాస్తు పరిశీలన, సహజీవన స్రవంతి పుస్తకావిష్కరణ, వాస్తు సిద్ధాంతి గుమ్మా శివ వెంకట లక్ష్మీనారాయణ, సామ్రాజ్యం దంపతులకు సన్మాన సభ ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఒంగోలు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, తూర్పు నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ నాయకురాలు షేక్ నూరి ఫాతిమా, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం లక్ష్మీనారాయణ, సామ్రాజ్యం దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాన్ని ఉగ్గం సాంబశివరావు, బోయిన సుబ్బారావు, కుర్రా పున్నారావు పర్యవేక్షించారు.

# కాస్మోటాలజీపై పెరిగిన ఆసక్తి




వర్క్‌షాపునకు హాజరైన వైద్యులతో ప్రధాన వక్త డాక్టర్ అవితాస్‌జాన్‌రాకేష్ ప్రసాద్

గుంటూరు మెడికల్: గుంటూరు అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్స్, వెనీరియాలజిస్ట్స్, అండ్ లెప్రాలజిస్ట్స్ ఆధ్వర్యంలో గుంటూరు మెడికల్ కాలేజ్ జింకానా ఆడిటోరియంలో ఆదివారం లేజర్ వర్క్‌షాప్ జరిగింది. మధురైకు చెందిన డాక్టర్ అవితాస్ జాన్‌రాకేష్‌ప్రసాద్ వర్క్‌షాపునకు ప్రధాన వక్తగా విచ్చేసి లేజర్ చికిత్సలు ఏ విధంగా చేయాలనే విషయాలను రోగులపై చేసి లైవ్‌గా చూపించారు. కాస్మోటాలజీతో అందం, ఆరోగ్యం వస్తాయని, ముఖాలపై గుంతలను లేజర్‌తో ఏ విధంగా మాయం చేయవచ్చు, నల్లమచ్చలను, అవాంచిత రోమాలను ఏ విధంగా తొలగించవచ్చు, చర్మంపై ఏర్పడే చారలు ఏ విధంగా తొలగించవచ్చనే విషయాలను డాక్టర్ అవితాస్ కూలంకుషంగా వివరించి డెమో చేసి చూపించారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కాస్మోటాలజీపై ప్రజలకు బాగా ఆసక్తి పెరుగుతుందని, పీజీ వైద్యులు ఇలాంటి వర్క్‌షాపుల్లో బాగా నేర్చుకుని ప్రాక్టీస్ చేయాలన్నారు. గుంటూరు వైద్య కళాశాల డెర్మటాలజీ వైద్య విభాగంలో అత్యాధునిక వైద్య పరికరాలు ఉన్నాయని, పీజీ వైద్యులు వాటిని వినియోగించుకుని ప్రాక్టీస్ చేయాలంటే ఇలాంటి వర్క్‌షాపులు వినియోగించుకోవాలన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కాస్మోటాలజీకి మెట్రోపాలిటన్ నగరాల్లో ఎంతో డిమాండ్ ఉందని చెప్పారు. నేటికి గ్రామాల్లో 70శాతం మంది ప్రజలకు కాస్మోటాలజీ పై అవగాహన లేదన్నారు. డిజిటల్ మీడియా వల్ల ప్రజలు నేడు అందానికి చాలా ప్రాధాన్యత ఇస్తున్నారని, చికిత్స చేసేముందు తప్పనిసరిగా కౌన్సిలింగ్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీఎంఈ కో ఆర్డినేటర్ డాక్టర్ అత్తోట కవిత, అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కె. శ్రీదేవి, సెక్రటరీ డాక్టర్ ఎ.శిరీష, జాయింట్ సెక్రటరీ డాక్టర్ కె.రాహుల్ కృష్ణ పాల్గొన్నారు.

# విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలను అందిస్తున్న హెచ్ఎం సరోజిని, ఉపాధ్యాయులు

గుంటూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగంలో సమూల మార్పులు తీసుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారని అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ప్రధానోపాధ్యాయురాలు వి.సరోజిని తెలిపారు. ఆదివారం పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న పాఠ్యపుస్తకాలను గ్రామ అభివృద్ధి కమిటీ సమక్షంలో అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకోసం నాడు-నేడు, విద్యా దీవెన వంటి పథకాలను ప్రవేశపెట్టి పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, బెల్ట్, టై, అందించటం సంతోషకరమన్నారు. విద్యార్థులు ముఖ్యమంత్రి అందించిన సంక్షేమ పథకాలను సద్వినియోగించుకుని ఉన్నత భవిష్యత్తును పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎం.సంజీవరెడ్డి, కె.పుల్లారెడ్డి, బోటనీ లెక్చరర్ శాంతిప్రియ పాల్గొన్నారు.

### కనుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



గుంటూరు రూరల్: ఉత్తర నక్షత్రం సందర్భంగా నగర శివారుల్లోని గోరంట్ల గ్రామంలోని పద్మావతిదేవి ఆండాళమ్మ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి రిలీజియస్ సొసైటీ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతిలో జరిగిన విధంగా ఆలయంలో వేదపండితుల సమక్షంలో భక్తులు పీటలపై కూర్చుని స్వామి కల్యాణం చేశారు. ముందుగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదం భక్తులకు అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గజవల్లి వెంకటప్పారావు, ప్రధాన కార్యదర్శి మేడా సాంబశివరావు, భక్తులు పాల్గొన్నారు.